క్లుప్తంగా

గ్రీవెన్స్‌లో వినతుల స్వీకరణ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. పలు వినతులకు వెంటనే పరిష్కారం చూపారు. మరికొన్ని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అనధికారిక నిర్మాణాల తొలగింపు

సీతమ్మధార: జోన్–3 పరిధి 23, 27, 25 వార్డులో పలు అక్రమ నిర్మాణలపై జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు కన్నెర్ర చేశారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు టీపీవో తేజ, అనిత పర్యవేక్షణలో అశోక్‌నగర్, సీతమ్మధార, సీతంపేట తదితర ప్రాంతాలలో అనధికారికంగా నిర్మిస్తున్న భవనాలను తొలగించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హ్యాండ్‌లూమ్ శారీ వాక్ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న మహిళా సంరక్షణ సెల్ చైర్‌పర్సన్ బూదమ్మ, తదితరులు

మురళీనగర్: కంచరపాలెంలోని ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం హ్యాండ్‌లూమ్ శారీ వాక్ కరపత్రాన్ని మహిళా రక్షణ సెల్ చైర్‌పర్సన్ ఎం.బూదమ్మ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బి.రామాంజనేయులు, కె.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వస్తువులు నిషేధించాలి



మాట్లాడుతున్న జెడ్సీ కృష్ణ

మురళీనగర్: ప్లాస్టిక్ వస్తువులు, పాలిథిన్ కవర్లు వాడకూడదని జెడ్సీ ఆర్.జి.వి.కృష్ణ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కంచరపాలెంలోని ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించి, పేపరుతో తయారు చేసిన వాటిని వాడాలని సూచించారు. కార్యక్రమంలో పీడీ పాపునాయుడు, వలంటీర్లు పాల్గొన్నారు.

కూలిన చెట్టుతో అవస్థలు



నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని కూలిన భారీ వృక్షం

సీతమ్మధార: స్థానిక నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని భారీ చెట్టు కూలిపోవడంతో రాకపోకలకు ఇబ్బంద వుతోంది. ఇటీవల వీచిన గాలులకు ఈ చెట్టు రోడ్డుపై కూలిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. జీవీఎంసీ సిబ్బంది స్పందించి చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



51వ వార్డు ఈస్ట్‌పార్కు వద్ద పవన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ



ఊర్వశి కూడలి జాతీయ రహదారిలో నిరసన తెలుపుతున్న వలంటీర్లు



కంచరపాలెం కూడలిలో రోడ్డుపై బైఠాయించిన కార్పొరేటర్ శశికళ, వలంటీర్లు



సీతంపేట కూడలిలో మానవహారం చేపట్టి నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు, కార్పొరేటర్ సారిపల్లి గోవింద్

పవన్ క్షమాపణ చెప్పాల్సిందే



53వ వార్డులో నిరసన తెలుపుతున్న గుజ్జు వెంకటరెడ్డి, వలంటీర్లు



80 ఫీట్ రోడ్‌లో మానవహారం నిర్వహిస్తున్న వలంటీర్లు

ఆగ్రహంతో జనసేనాని దిష్టిబొమ్మలు దహనం చేసిన వలంటీర్లు

సీతంపేట: వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్‌పై విశాఖ ఉత్తర నియోజకవర్గంలో వాడవాడలా నిరసనలు వెల్లువెత్తాయి. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను నిస్వార్థంగా లబ్ధిదారుల గడప వద్దకు చేరుస్తున్న తమపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమంటూ వలంటీర్లు రోడ్డెక్కి నిరసన తెలిపారు. కరోనా వంటి కష్టకాలంలో సైతం ప్రాణాలకు తెగించి సేవలందించిన తమపై చౌకబారు విమర్శలు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

● వలంటీర్లకు పవన్ కల్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ డిమాండ్ చేశారు. మహిళల అదృశ్యం వెనుక వలంటీర్లు ఉన్నారంటూ ఆరోపించడం దుర్మార్గమని మండిపడ్డారు. 25వ వార్డులో పనిచేస్తున్న వలంటీర్లు సీతంపేట దుర్గా గణపతి ఆలయం వద్ద మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. పవన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సారిపిల్లి సంతోష్, సన్నీ, గౌరినాయుడు, అప్పన్న, కొండబాబు, బొమ్మాళి రవి, గోవిందమ్మ, జయ, పద్మ పాల్గొన్నారు.

● వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్‌పై వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి తీవ్రంగా మండిపడ్డారు. జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్‌లో మహిళా నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పృహ లేకుండా పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కరోనా సమయంలో సైతం ప్రాణాలకు తెగించి సేవలందించిన వలంటీర్లను కించపర్చేలా మాట్లాడటం విజ్ఞత కాదన్నారు. పి.అమ్మాజి, గౌషియ, విజయలక్ష్మి, సుశీల, లక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు.

నక్కవానిపాలెంలో మానవహారం

సీతమ్మధార: వలంటీర్ల వ్యవస్థపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో వలంటీర్లు నక్కవానిపాలెం ప్రధాన రహదారిలో మానవహారం నిర్వహించారు. పవన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పద్మారెడ్డి మాట్లాడుతూ వలంటీర్లకు వెంటనే పవన్ కల్యాణ్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేవారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సాడి కేశవరెడ్డి, రఘురామిరెడ్డి, సీతాకుమారి, చిన్న, వెంకటలక్ష్మి, జమున పాల్గొన్నారు.

తాటిచెట్లపాలెం: వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని జీవీఎంసీ 45వ వార్డు పరిధిలో గల వలంటీర్లు డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం తాటిచెట్లపాలెం హైవే పక్కన గల ఆంజనేయస్వామి గుడి నుంచి వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం 80 ఫీట్ రోడ్‌లో పవన్ కల్యాణ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలతో మానవహారం నిర్వహించారు. వలంటీర్లు స్వచ్ఛంద సేవకులే కానీ సంఘ విద్రోహ శక్తులు కాదన్నారు. హరి పట్నాయక్, కారుకొండ రాజు, నేపాల్ శ్రీను, బాబూరావు, నానిబాబు, పైడి నాగరాజు, దుర్గ, నాయుడు, గణపతి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ క్షమాపణలు చెప్పాలి

సీతమ్మధార : జీవీఎంసీ 14 వార్డు పరిధిలో విధులు నిర్వహిస్తున్న వలంటీర్ల నిరసనకు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ, వలంటీరు వ్యవస్థ ఏర్పాటు చేశారన్నారు. కరోనా సమయంలో విస్తృత సేవలందించారని కొనియాడారు. తక్షణమే పవన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బల్ల శ్రీనివాస్, కోడూరు సత్యనారాయణ, బోగలింగేశ్వరరావు, ప్రవీణ్ వర్మ, నవీన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

సీతంపేట: ప్రజలకు సంక్షేమ పథకాలు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న వలంటీర్లపై పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం చాలా బాధాకరమని జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు అన్నారు. పవన్ వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ 44వ వార్డులో పనిచేస్తున్న వలంటీర్లు మంగళవారం ఉదయం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావుతో కలిసి 80 అడుగుల రోడ్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ, వారు అందిస్తున్న సేవలపై మిడిమిడి జ్ఞానంతో అవగాహన లేకుండా మాట్లాడిన పవన్ కల్యాణ్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హబీబ్, తిరుపతి, పోలరాజు, గోపి, వలంటీర్లు పాల్గొన్నారు.



80 అడుగుల రోడ్‌లో నిరసన తెలుపుతున్న వలంటీర్లు, కార్పొరేట్ బానాల శ్రీనివాసరావు

కంచరపాలెం: ప్యాకేజీల కోసం వలంటీర్లపై పవన్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ అన్నారు. 46వ వార్డు తాటిచెట్లపాలెం జాతీయ రహదారి కూడలిలో వలంటీర్ల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కైలాసపురం నుంచి తాటిచెట్లపాలెం జాతీయ రహదారి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్.అప్పారావు, గోవిందు, రామారావు, శ్రీను, కృష్ణ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

● వలంటీర్లకు పవన్ కల్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరుతూ జీవీఎంసీ 48వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి నీలి రవి, నాయకుడు కర్రి రామారెడ్డి ఆధ్వర్యంలో ఊర్వశి కూడలి జాతీయ రహదారిలో వలంటీర్లు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డికి ప్రజల్లో లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు నాయుడు డైరెక్షన్లో పవన్ కల్యాణ్ వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసి మనోభావాలు దెబ్బతీశారన్నారు.

● జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలతో ప్రజలకు సేవ చేస్తున్న వలంటీర్ల మనోభావాలు దెబ్బతిన్నాయని కార్పొరేటర్ కేవీఎన్ శశికళ అన్నారు. జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ కూడలిలో వలంటీర్లు మంగళవారం నిరసన తెలుపుతూ మానవహారం నిర్వహించి, రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శశికళ మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థను కించపరచడం పవన్ కల్యాణ్ అజ్ఞానానికి నిదర్శనమన్నారు.

మర్రిపాలెం : వలంటీర్లపై పవన్ వ్యాఖ్యలను ఖండిస్తూ జీవీఎంసీ 49వ వార్డు మసీదు జంక్షన్‌లో కార్పొరేటర్ అల్లు శంకరరావు ఆధ్వర్యంలో వలంటీర్లు మానవహారం నిర్వహించారు. 50వ వార్డులోని మాధవధార 48వ నంబరు బస్టాప్ జంక్షన్‌లో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

● వలంటీర్ల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడిన జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ బహిరంగ క్షమపణ చెప్పాలని 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ డిమాండ్ చేశారు. వార్డులోని ఈస్ట్ పార్కు వద్ద వలంటీర్ల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. అనంతరం వారు పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

● 53వ వార్డులోని ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో వలంటీర్లు నిరసన తెలిపారు. షేక్ బాబ్జీ, ఝాన్సీ, హనుమంతు, సుశీల, తరుణ్ సంపత్, చాందిని, జయ, సుజాత, అలీ, భాను, సోను పాల్గొన్నారు. అనంతరం పవన్ కల్యాణ్‌పై ఎయిర్ పోర్టు జోన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు తగదు



వలంటీర్లు మంచి సేవలు అందిస్తున్నారు. మేము ఆరిలోవ ప్రాంతం ఆపరేషన్ కాలనీలో నివాసముంటున్నాం. మా ఇంట్లో దివ్యాంగ పింఛన్ ప్రతి నెలా 1న ఉదయమే వచ్చి అందిస్తారు. వైఎస్సార్ ఆసరా, నా భర్తకు టైలర్ భృతి, జగనన్న ఇంటి కోసం మాతో దగ్గరుండి దరఖాస్తు చేయించి మంజూరు చేశారు. ఇలాంటి సేవలు అందిస్తున్న వలంటీర్లను పవన్ కల్యాణ్ నిందించడం మంచిది కాదు.

– శివదల పార్వతి, సంక్షేమ పథకాల లబ్ధిదారు

ప్రాణాలకు తెగించి సేవలందించాం



కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించాం. ప్రతీ నెలా పింఛన్లు, రేషన్, సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజల ఇళ్ల వద్దకే చేర్చుతున్నాం. ఇవన్నీ పవన్ కల్యాణ్‌కు కనిపించలేదా. మహిళల అదృశ్యాన్ని వలంటీర్లకు ఆపాదించేలా మాట్లాడటానికి నోరెలా వచ్చింది. వలంటీర్లందరికీ బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే. లేదంటే నిరసనలు మరింత ఉధృతం చేస్తాం.

– ఉప్పాడ సన్యాసిరావు, వలంటీర్, సీతంపేట సచివాలయం



అభయాంజనేయ ఆలయం రోడ్డులో నిరసన తెలుపుతున్న వలంటీర్లు, కార్పొరేటర్ అనిల్‌కుమార్ రాజు



అక్కయ్యపాలెంలో నిరసన తెలుపుతున్న పీలా వెంకటలక్ష్మి, తదితరులు



నక్కవానిపాలెం ప్రధాన రహదారిలో మానవహారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, వలంటీర్లు



నిరసన తెలుపుతున్న 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, వలంటీర్లు

జనాభా నియంత్రణతోనే అభివృద్ధి సాధ్యం

మహారాణిపేట: జనాభా నియంత్రణతోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మంగళవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ఈ ర్యాలీని జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడు ప్రపంచ జనాభా 800 కోట్ల చేరువలో ఉండగా.. భారత్ జనాభా 142 కోట్ల చేరువలో ఉందన్నారు. రాష్ట్ర జనాభా 5 కోట్ల చేరువ లో ఉందని చెప్పారు. జనాభా పెరగడంతో పేదరిక దేశంగా మారే ప్రమాదం ఉందన్నారు. పేదరిక నిర్మూలన భారత్‌లో దీర్ఘకాలిక లక్ష్యమని చెప్పారు. కుటుంబ నియంత్రణ పద్ధతులను ప్రోత్సహించాలని డీఎంహెచ్‌వో సూచించారు. ఈ ర్యాలీలో ప్రొగ్రాం అధికారులు, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, వైద్య ఆరోగ్య కార్యాలయ సిబ్బంది, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

పక్కాగా ఓటర్ జాబితా



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

సీతమ్మధార: మార్పులు, చేర్పులు చేసి ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలని బీఎల్‌వోలను సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ ఆనంద్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో జరగబోయే ఎన్నికల దృష్ట్యా బీఎల్‌వోలు పాత ఓటరు జాబితాతో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించాలని సూచించారు. అద్దె ఇళ్లల్లో ఉండే ఓటర్ల మార్పులు, చేర్పులు, చిరునామా మార్పులు వివరాలు సేకరించి కొత్తగా ఓటర్ జాబితా అప్‌డేట్ చేసి, అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా పనిచేసి ఖచ్చితమైన ఓటరు జాబితా సిద్ధం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో మరిన్ని సేవలు

మర్రిపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష'తో ప్రజలకు మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తున్నాయని 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ పేర్కొన్నారు. వార్డులోని వుడా కాలనీ – 1 సచివాలయంలో మంగళవారం అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నారన్నారు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్, ఆధార్‌తో మొబైల్ అనుసంధానం చేస్తున్నారని తెలిపారు. ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకు జరిగే సురక్ష కార్యక్రమంలో ఇంకా కొత్త రైస్‌కార్డులు, వాటిలో మార్పులు చేర్పులు చేస్తారని తెలిపారు. ప్రజలకు ఈ సేవలు అంకితభావంతో అందించాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లను కోరారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జి నీలి రవి, 292వ నంబరు సచివాలయం కన్వీనర్లు సనపల నారాయణస్వామి, కనమటి రఘు, సనపల రమేష్, సచివాలయం కార్యదర్శులు శివ, స్వప్న, స్వాతి, విజయలక్ష్మి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్

గడువులోగా పంటల ధ్రువీకరణ పత్రం సమర్పించాలి

సీతంపేట: రైతులు తమ పొలాల్లో ఏయే పంటలు పండిస్తున్నారో వీఆర్వో, హార్టికల్చర్ ఆఫీసర్‌తో సర్టిఫై చేయించి గడువులోగా ధ్రువీకరణ పత్రం ఎస్టేట్ ఆఫీసర్‌కు అందజేయాలని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడీఎం ఎస్.కె.యాసిన్ సూచించారు. నరసింహనగర్ రైతుబజార్‌లో మంగళవారం ఉదయం రైతులు, డ్వాక్రా సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టాల్‌లో ఉన్న రైతులంతా విధిగా గుర్తింపు కార్డులు ధరించాలన్నారు. డ్రా ద్వారా కేటాయించిన స్టాళ్లలో మాత్రమే రైతులకు కూరగాయల విక్రయలు జరపాలని, వినియోగదారులతో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. తూకంలో ఎట్టి పరిస్థితుల్లో తేడా రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. ప్రతి రోజూ ఉదయం 10 గంటల్లోపు మారు వర్తకులు, హోటళ్లకు బల్క్‌గా కూరగాయలు విక్రయించకూడదని రైతులను ఆదేశించారు. రైతులు తమ కాటాలను ప్రతి సంవత్సరం గడువులోగా స్టాంపింగ్ చేయించుకోవాలని, బోర్డుపై నిర్దేశించిన ధరలకు కూరగాయలు విక్రయించాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు, సహాయకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.



నరసింహనగర్ రైతుబజార్‌లో మాట్లాడుతున్న ఏడీఎం యాసిన్

విశాఖ ఉక్కును కాపాడుకుంటాం

కూర్మన్నపాలెం: కార్మికులు పట్టువదలక ఉక్కు పరిశ్రమ కోసం నిద్రాహారాలు మాని పోరాటం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ప్రశ్నించారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే దీక్షలు మంగళవారం నాటికి 880వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని డిమాండ్ చేశారు. ఉక్కు పోరాటం మొదలుపెట్టి 880 రోజులు గడుస్తున్న కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ఇంత చిన్నచూపు చూడడం సరికాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, పార్లమెంట్‌లో ఉపసంహరణ బిల్లును ప్రవేశ పెట్టాలని, లేకపోతే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

23న ప్రజా సింహగర్జన

దాబాగార్డెన్స్ : బీసీలకు రాజ్యాధికారం వచ్చేలా త్వరలో నూతన పార్టీ ఆవిర్భావం జరుగుతుందని బీసీ జాతీయ నేత బోడే రామచంద్రయాదవ్ పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్లో మంగళవారం అనకాపల్లి జిల్లా భారతీయ యాదవ మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ మొల్లి సన్నిబాబు నిర్వహించిన నూతన పార్టీ ఆవిర్భావ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 23న దళిత, బహుజన, రైతు, శ్రామిక, మైనార్టీ, వెనుకబడిన కులాల రాజ్యాధికారం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రజా సింహగర్జన నిర్వహించనున్నట్టు చెప్పారు. గుంటూరు..విజయవాడ జాతీయ రహదారి నాగార్జున విశ్వ విద్యాలయం ఎదురుగా నిర్వహించనున్న ప్రజా చైతన్య వేదికకు పెద్ద ఎత్తున ఆయా వర్గాల ప్రజలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఐక్యంగా ఉంటూ రాజ్యాధికారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నమ్మి అప్పలరాజు, బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కిలాడి అప్పలరాజు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కార్మికుల భిక్షాటన



పెదగంట్యాడ జంక్షన్‌లో భిక్షాటన చేస్తున్న గంగవరం పోర్టు కార్మికులు

పెదగంట్యాడ: గంగవరం పోర్టు నిర్మాణం జరిగితే గంగవరం, దిబ్బపాలెంలోని మత్స్యకారుల బతుకుల్లో వెలుగులు వస్తాయని అనుకున్నామని, కానీ అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం కార్మికులను ఇలా బిచ్చగాళ్లను చేస్తుందని అనుకోలేదని గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు అన్నారు. జీతాలు పెంచాలని కోరుతూ గంగవరం పోర్టు కార్మికులు చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలు మంగళవారం 8వ రోజుకు చేరుకున్నాయి. ఈ ఆందోళన కార్యక్రమంలో భాగంగా కార్మికులంతా కలిసి పాత గాజువాక జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. పోర్టు యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పాత గాజువాక జంక్షన్ నుంచి పెదగంట్యాడ వరకూ భిక్షాటన చేశారు.